క్లుప్తంగా

ఇన్‌స్పైర్ మనాక్‌కు ఎంపిక


విద్యార్థినిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

పెనగలూరు: మండలంలోని చక్రంపేట జెడ్పీ హైస్కూల్ విద్యార్థి బి.సుమియా ఇన్‌స్పైర్ మనాక్ అవార్డుకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు గోపాలకృష్ణ తెలిపారు. విలేకరులతో ఆయన మాట్లాడుతూ 2025 సంవత్సరంలో ఇన్‌స్పైర్ మనాక్‌లో ప్రతిభ చూపడంతో సుమికాకు కేంద్ర ప్రభుత్వం రూ.10000 బహుమతి అందిస్తుందన్నారు. ఎంఈఓ గిరి వరదయ్య, హరిప్రసాద్, అన్వర్‌బాషా, శ్రీవాణి, ఉపాధ్యాయులు విద్యార్థినికి మెమెంటో అందజేసి అభినందించారు.

ప్రభుత్వ కళాశాలల్లో చదివించండి


పరీక్ష సామగ్రి అందజేస్తున్న డీఆర్.హరిత

ఓబులవారిపల్లె: మండలంలోని చిన్నఓరంపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పిల్లలను చేర్పించాలని ప్రిన్సిపల్ డీఆర్.హరిత తల్లిదండ్రులను కోరారు. తల్లెంవారిపల్లి, చిన్నఓరంపాడు, ఓబులవారిపల్లి జెడ్పీ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో వార్షిక పరీక్షలు రాసే విద్యార్థులకు ప్యాడ్‌లు, పెన్నులు గురువారం ఆమె ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదివి అత్యున్నత స్థాయిలో రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాయచోటిలో జాబ్‌మేళా

రాయచోటి జగదాంబసెంటర్: రాయచోటి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 7న యంగ్ ఇండియా కంపెనీ ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ పి.హర్షలతా పంకజ్ తెలిపారు. రాయచోటి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం ఆమె మాట్లాడుతూ నిరుద్యోగ యువతీ యువకులు తమ విద్యార్హత సర్టిఫికెట్లు, ఆధార్ కార్డ్, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో, రెస్యూమ్‌లతో శుక్రవారం ఉదయం 10 గంటలకు కళాశాల ప్రాంగణానికి హాజరుకావాలన్నారు.

ధ్రువీకరణ పత్రాలు అందజేత


ధ్రువీకరణ పత్రాలు ఇస్తున్న డీఈఓ సుబ్రహ్మణ్యం

సుండుపల్లె: జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలలో ప్రతిభ కనపరిచిన క్రీడాకారులకు ధ్రువీకరణ పత్రాలను డీఈఓ సుబ్రహ్మణ్యం గురువారం అందజేశారు. మహారాష్ట్రలో జరిగిన సాఫ్ట్‌బాల్ క్రీడా పోటీల్లో జెడ్పీ పాఠశాల, ప్లస్–2 జూనియర్ కళాశాల విద్యార్థులు నంద్యాల బేబీ, కె.ఆంజనేయులు అద్భుతంగా రాణించారు. ఈ సందర్భంగా డీఈవో వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు జయన్న, పీడీలు రవీంద్రరాజు, రాధారాణి, పాల్గొన్నారు.

పశువులకు టీకా వేయించాలి

సిద్దవటం: పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని సిద్దవటం పశు సంవర్ధక శాఖ ఏడీఏ లక్ష్మీదేవి తెలిపారు. సిద్దవటం పశువుల ఆసుపత్రిలో గురువారం గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేశారు. ఏడీఏ లక్ష్మీదేవి మాట్లాడుతూ గాలికుంటు వ్యాధి సోకితే పశువులకు తీవ్రమైన జ్వరం, నీరసం, నోటి నుంచి తీగమాదిరి చొంగ కారడం, నోరు, కాలి గిట్టల మధ్య పుండ్లు, ఎండకు రొప్పడం, చూడి పశువులు ఈసకపోవడం వంటి లక్షణాలు ఉంటాయన్నారు. పశువుల్లో పాల ఉత్పత్తి, పని సామర్థ్యం గణనీయంగా తగ్గిపోతుందన్నారు. టీకా వేయిస్తే వ్యాధి నివారించవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో జిలానీ బాషా, రైతులు పాల్గొన్నారు.

పరీక్ష సామగ్రి అందజేత


దాత అందజేసిన సామగ్రితో విద్యార్థులు

వీరబల్లి: మండల కేంద్రంలోని జెడ్పీ పాఠశాలలో పది పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు స్థానికుడు తాటిగుట్ల శ్రీధర్‌రెడ్డి పరీక్ష సామగ్రి గురువారం ఉచితంగా అందజేశారు. ఆయన మాట్లాడుతూ కొద్ది సమయంలోనైనా విద్యార్థులు కాలాన్ని వృథా చేయకుండా శ్రద్ధగా చదివి మంచి మార్కులు సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రెడ్డయ్య, శ్రీనివాసులు, జైచంద్రారెడ్డి, బాబురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎల్లమ్మ తిరునాలకు ఏర్పాట్లు


ఎల్లమ్మ

సుండుపల్లె: మండలంలోని యల్లారెడ్డిగారిపల్లె, చెన్నంశెట్టిపల్లెల్లో వెలసిన ఎల్లమ్మ తల్లి తిరునాల శని, ఆదివారాల్లో నిర్వహిస్తున్నట్లు గ్రామస్థులు తెలిపారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహిస్తామని, లిందుకోసం ప్రత్యేక ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

చర్చిల్లో లెంట్ డేస్


లెంట్ డేస్ ప్రత్యేకతను క్రైస్తవులకు తెలుపుతున్న పాస్టర్ విశ్వప్రసాద్

రాజంపేట టౌన్: ఉపవాసాలతో 40 రోజులపాటు చర్చిల్లో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు జరిపే లెంట్ డేస్(శ్రమకాలపు దినాలు) చేపడుతున్నారు. నిత్యం ఉపవాసాలు చేస్తూ నలభై రోజుల పాటు ఈ ప్రార్థనలు కొనసాగిస్తారు.

నలభై రోజులు ఎందుకంటే..

మానవుల పాపాలు పెరిగిపోవడంతో జల ప్రళయం సంభవిస్తుందని దేవుడు ముందుగానే గుర్తించి పెద్ద ఓడను సిద్ధం చేసి ప్రజలకు ఆ విషయం చెబుతాడు. మంచి మార్గంలో ఉన్న వారు ఓడను ఎక్కగా.. చెడు మార్గంలో ఉన్నవారు మునిగిపోయారు. ఈ జల ప్రళయం నలభై రోజులపాటు కొనసాగిందని, మోషే దైవ సన్నిధిలో గడిపిన ఏలియా ఉపవాసంతో ప్రార్థనలు చేసి శక్తిని పొందాడని క్రైస్తవులు నమ్ముతారు. అనంతరం ఆయన పొందిన పది ఆజ్ఞల గురించి బైబిల్‌లో రాశారని, వాటి ప్రకారమే ప్రజలు నడుచుకోవాలని చెబుతారు. అందువల్ల క్రైస్తవులు, విశ్వాసులు నలభై రోజులపాటు గుడ్ ఫ్రైడేకు ముందు ఈ లెంట్ డేస్ పాటిస్తారు.

ఉపవాసం అంటే....

శ్రమకాలంలో చాలా మంది క్రైస్తవులు, విశ్వాసులు నలభై రోజులు ఉపవాసం ఉంటారు. మరింతమంది సోమవారం లేదా శుక్రవారం ఉపవాసం ఉంటారు. ఉపవాసం అనగా ఉపేక్షించుకొని.. పరీక్షించుకొని.. వాక్య సందేశంతో ముందుకు సాగడమని అర్థం. ఉపవాసాన్ని ఉదయం ఆరు గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు, లేకుంటే సాయంత్రం ఆరు గంటల నుంచి ఉదయం ఆరుగంటల వరకు నిర్వహించుకోవచ్చని పాస్టర్లు చెబుతున్నారు.

ఇసుక అక్రమ రవాణా


దేగనవాండ్లపల్లెలో పెన్నానది నుంచి ఇసుక రవాణా

సిద్దవటం: మండలంలో ఇసుక అక్రమ రవాణా జోరందుకుంది. నాయకుల అండతో కొందరు నిత్యం ట్రాక్టర్ల ద్వారా ఇసుక తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. మండలంలోని టక్కోలు, దేగనవాండ్లపల్లె, మాచుపల్లె, లింగంపల్లె, సిద్దవటం పెన్నానది పరివాహక గ్రామాల నుంచి నిత్యం ఇసుక రవాణా అవుతోంది. కొందరు అక్రమార్కులు ట్రాక్టర్ల ద్వారా కడప నగరానికి రవాణా చేస్తూ వేల రూపాయలు సంపాదిస్తున్నారు. దీంతో ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోంది. ఇసుక రవాణాతో తమ బోర్లలో భూగర్భజలాలు అడుగంటి పంట నష్టపోయే ప్రమాదం ఉందని స్థానిక రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. పెన్నానదిలో ఇసుక రవాణా చేసే వారు అధికలోతుకు గొయ్యి తీయడంతో ఇబ్బంది పడుతున్నామని తెలిపారు. సిద్దవటం ఇన్‌చార్జి తహసీల్దారు మాధవీలత వివరణ కోరగా అక్రమ ఇసుక రవాణా జరిగే పెన్నానది ప్రాంతాల్లోకి వాహనాలు వెళ్లకుండా రోడ్డుకు అడ్డంగా జేసీబీ యంత్రాలతో గోతులు తీసి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తామన్నారు.

రేపు సర్వసభ్య సమావేశం

ఒంటిమిట్ట: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ కెఆర్‌ఎం.ప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు. సమావేశానికి మండల సభ్యులు, అన్ని శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు హాజరవుతారన్నారు.

రంగంపల్లిలో గ్రామ సభ


గ్రామ సభలో పాల్గొన్న అధికారులు

పుల్లంపేట: మండలంలోని రంగంపల్లి సచివాలయం వద్ద గురువారం గ్రామసభ నిర్వహించారు. ఏపీఓ శ్రీనివాసులు, సచివాలయ సిబ్బంది ఆధ్వర్యంలో 2023–24 సంవత్సరానికి సంబంధించి జాతీయ ఉపాధి హామీ పథకం పనులపై షల్ ఆడిట్ నిర్వహించారు. ఈ నెల 13న ఎంపీడీఓ కార్యాలయం నందు ఓపెన్ ఫోరమ్ ఉంటుందని అధికారులు తెలిపారు.

ఫ్రూట్ కవర్లలో మామిడికి భలే గిరాకీ

సుండుపల్లె: మామిడి రైతులు జాగ్రత్తలు పాటించి ఫ్రూట్ కవర్లు తొడిగిన మామిడి కాయలకు మంచి గిరాకీ ఉంటుందని జిల్లా ఉద్యానవన శాఖ అధికారి రవీంద్రబాబు అన్నారు. మండలంలోని తిమ్మసముద్రం, మడితాడు గ్రామాల మామిడి రైతులకు గురువారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మామిడి పండ్లకు కవర్లు తొడగడంతో నల్ల తామర పురుగులు, పండు ఈగ, తేనెమంచు పురుగు, మసి తెగులు, బంక తెగుళ్ల నుంచి ఉపశమనం కలుగుతుందన్నారు. కవర్లు తొడిగిన మామిడి కాయలు నాణ్యత, కలర్, రంగు రుచి, వాసన కలిగి ఉంటాయన్నారు. ఈ పండ్లకు తొడిగే కవర్లను ఉద్యాన శాఖ 50 శాతం రాయితీతో ఎకరాకు 4 వేల కవర్లను అందిస్తోందన్నారు. ఒక్కొక్క కవరు ఖరీదు రూ.2.20పై కాగా, రైతు వాటా రూ.1.20పై. తీసుకుంటారన్నారు. రైతులు భూమి పాసుపుస్తకం జిరాక్స్, ఆధార్, అకౌంట్ జిరాక్స్, చిన్న పాస్‌పోర్టు సైజు ఫొటో తీసుకుని దగ్గరలోని రైతు సేవా కేంద్రంలో నమోదు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల ఉద్యాన శాఖఅధికారి వనిత, ప్రకృతి వ్యవసాయ నిపుణులు, ఆర్‌ఎస్‌కే సిబ్బంది పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న రవీంద్రబాబు

కవర్ల వాడకం లాభదాయకం

సిద్దవటం: మామిడి తోటల్లో కాయలకు ఫ్రూట్ కవర్ల వాడకం ఎంతో లాభదాయమని ఉద్యాన అధికారి జయభరత్‌రెడ్డి తెలిపారు. సిద్దవటంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఫ్రూట్ కవర్లు వాడడంతో తామర, తేనెమంచు పురుగులు, పండు ఈగ నుంచి రక్షణ కలుగుతుందని, అధిక వేడిమి, వడిగండ్ల వాన నుంచి కాపాడుకోవచ్చునని తెలిపారు. కాయలు నిమ్మకాయ, కోడిగుడ్డు సైజులో ఉన్నప్పుడు గాలి చొరబడకుండా తొడిమ వరకూ కవరు కట్టుకోవాలన్నారు. 50 శాతం రాయితీతో గరిష్ఠంగా 1 హెక్టారుకు 10వేల కవర్లు అందిస్తున్నామని, సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు.


కాయలకు ఏర్పాటుచేసిన ఫ్రూట్ కవర్లు

రైతులకు చేయూత

పుల్లంపేట: మండలంలోని మామిడి రైతులకు రాయితీపై ఫ్రూట్ కవర్లు అందజేసి చేయూత ఇస్తున్నట్లు వ్యవసాయాధికారిణి గాయత్రి తెలిపారు. రూ. 2.20 విలువజేసే ఒక్కో ఫ్రూట్ కవర్ రాయితీపై రూ.1.20కు ఇస్తారన్నారు. మామిడి కాయల నాణ్యతను పెంచుకోవడంతోపాటు తెగుళ్లను నివారించవచ్చన్నారు.

పంటలకు మద్దతు ధరలు ప్రకటించాలి

సంబేపల్లి: టమాట, ఉలవ, కంది, అలసంద, దోస, వంకాయ, వేరుశనగ పంటలకు వెంటనే మద్దతు ధర ప్రకటించాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జములయ్య, రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షుడు రంగారెడ్డి, ఏపీ వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు వైవి.శివయ్యలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సంబేపల్లె, చిన్నమండెం, రాయచోటి మండలాల్లో రైతులు సాగు చేసిన వివిధ పంటలను గురువారం ఆయన పరిశీలించారు. వారు మాట్లాడుతూ 15 కిలోల టమాట బాక్సుకు రూ.350కు తగ్గకుండా గిట్టుబాటు ధర కల్పించాలన్నారు. మదనపల్లె, గుర్రకొండ, కలకడ తదితర మండలాల్లో కొనుగోలు కేంద్రాలు పెట్టి టమాట కొనుగోలు చేస్తామని చెప్పిన ప్రభుత్వం ఇప్పటివరకూ స్పందించలేదని కొందరు రైతులు నాయకులకు విన్నవించారు. తమ పంటలకు మద్దతు ధర ప్రకటించాలని వారు కోరారు.


టమాట పంటను పరిశీలిస్తున్న నాయకులు

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు


మాట్లాడుతున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు

సిద్దవటం: క్రికెట్ బెట్టింగులు, అసాంఘీక కార్యకలాపాలకు ఎవరైనా పాల్పడితే అట్టివారిపై కఠినచర్యలు తప్పవని కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు హెచ్చరించారు. మండల కేంద్రమైన సిద్దవటం లోని పోలీసు స్టేషన్‌ను గురువారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇసుక అక్రమ రవాణా చేసే వాహనాదారులు తరచూ పట్టు బడితే అలాంటి వాహనాలను మైన్స్ అధికారులకు, ఆర్టీఓ లకు పంపడంతోపాటు, వారిపై షీట్స్ ఓపెన్ చే స్తామన్నారు. వేసవి కాలంలో బయట ప్రాంతాలకు వెళ్లే టప్పుడు విలువైన బంగారు అభరణాలను, డబ్బును బ్యాంకు లాకర్‌లో పెట్టుకోవాలన్నారు. సెలవుల్లో పెండ్లిల్లకు, బయట ప్రాంతాలకు వెళ్లే టప్పుడు పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. పోలీసులు ఆ నివాస గృహాన్ని తరచూ పరిశీలస్తారన్నారు. దొంగతనాలు జరగకుండా ఇంటి పరిసర ప్రాంతాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. అంతేగాకుండా భాకరాపేట మూడు రోడ్ల కూడలిలో ట్రాఫిక్ అంతరాయం లేకుండా చూడాలని పోలీసులకు ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఒంటిమిట్ట సీఐ టి. బాబు, సిద్దవటం ఇన్‌చార్జి ఎస్‌ఐ శివప్రసాద్, ఏఎస్‌ఐ సుబ్బరామచంద్ర, పోలీసులు పాల్గొన్నారు.

సమస్యలపై సమష్టిగా పోరాడుదాం

వీరబల్లి: విలేకరుల సమస్యలపై సమష్టిగా పోరాడదామని జిల్లా ఏపీయూడబ్ల్యూజే అధ్యక్షుడు గొనిపల్లి శ్రీనివాసులు అన్నారు. స్థానిక ఎస్‌డీకేఆర్ డిగ్రీ కళాశాలలో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వాట్సాప్‌లో తప్పుడు ప్రచారాలు పెట్టిన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. సమాజంలో కొందరు అధికారులు, ప్రజా ప్రతినిధులు విలేకరులపై నిందలు వేస్తూ చిన్నచూపు చూడడ తగదన్నారు. అనంతరం మండల కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా ఆమూరి ఈశ్వరయ్య, ఉపాధ్యక్షుడిగా వైవీ.రమణ, ప్రధాన కార్యదర్శిగా కాల్వపల్లి భాస్కర్, కార్యదర్శిగా పురం రాజేంద్ర, కోశాధిగారిగా టి.రామాంజనేయులు, ప్రధాన కార్యదర్శిగా పెద్దవీటి శ్రీనివాసులు, సంయుక్త కార్యదర్శిగా దేరింగుల రాంప్రసాద్, గౌరవ సలహాదారులుగా దుగ్గనపల్లి సురేందర్‌రెడ్డి, సభ్యులుగా దయ్యాల రమణయ్య, చౌదూరి శేఖర్, కొమ్మ జగన్ మోహన్, సుదాకర్ రెడ్డి, రవి, రడ్డిశేఖర్, బత్తిన నాగార్జున ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్.రమేశ్‌కుమార్‌రాజు, గౌరవాధ్యక్షుడు పల్లం తాతయ్య, కె.వెంకట్రామరాజు, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు

రుణాల పంపిణీలో అర్హులకు మొండిచేయి

నందలూరు: బీసీ, కాపు, ఓసీ కార్పొరేషన్ రుణాలు రాయితీపై ఇస్తుండడంతో వేల మంది దరఖాస్తు చేశారు. తమకు రుణం దక్కుతుందని భావించిన వారికి ఇపుడు అధికారులు మొండి చేయి చూపుతున్నారు. మండలంలో ఈ నెల 18వతేదీన 54 యూనిట్ల కోసం దరఖాస్తు చేసుకున్న 379 మందికి మౌఖిక పరీక్ష నిర్వహించారు. అయితే ఇటీవల కొందరు వెళ్లి ప్రశ్నించగా.. ఆ నాయకులు చెబితేనే ఇస్తామంటూ చెప్పడంతో నిరుద్యోగులు అసహానానికి గురవుతున్నారు. అధికార పార్టీ నాయకుల అండ ఉన్న 54 మందిని ఎంపిక చేయడంతో బీజేపీ, జనసేన నాయకులు గురువారం మధ్యాహ్నం ఎంపీడీఓ వద్దకు చేరుకుని వాగ్వాదానికి దిగారు. తాము కూటమి నాయకులమే, తమకు సంబంధించిన అర్హులకు మంజూరుచేయలేదంటూ మండి పడ్డారు. ఎంపీడీఓ మాట్లాడుతూ బీజేపీకి నాలుగు, జనసేనకు మూడు యూనిట్లు ఇస్తామని ఒప్పందం కుదరడంతో వెనుదిరిగారు. ఇదంతా గమనించిన నిరుద్యోగ యువకులు తాము పెట్టుకున్న ఆశలు అడియాశలయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. అర్హులకు ఇవ్వకపోతే కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని హెచ్చరిస్తున్నారు. జిల్లా కలెక్టర్ సబ్సిడీ రుణాలపై విచారణ చేపట్టి అర్హులకు అందేలా చూడాలని కోరుతున్నారు.


ఎంపీడీఓతో మాట్లాడుతున్న బీజేపీ, జనసేన నాయకులు

అన్ని రంగాల్లో మహిళల ముందడుగు

లక్కిరెడ్డిపల్లి: మహిళలు అన్ని రంగాలలో ముందడుగు వేస్తున్నారని లక్కిరెడ్డిపల్లి ఐసీడీఎస్ సీడీపీఓ పద్మావతి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా గురువారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో సీడీపీఓ పద్మావతిని సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పద్మావతి మాట్లాడుతూ ఇంటికి దీపం ఇల్లాలు అని, ప్రతి కుటుంబంలో స్త్రీ చదువుకొంటే ఆ కుటుంబంలో అందరూ విద్యావంతులవుతారని అన్నారు. స్త్రీ జగానికి మూలాధారం అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో దాదీబీ, సుజాత, లక్ష్మీదేవి, పద్మజ, అరుణ, తదితరులు పాల్గొన్నారు.


సీడీపీఓ పద్మావతిని సన్మానిస్తున్న సిబ్బంది

ఏపీ మోడల్ స్కూల్‌లో ప్రవేశాలకు ఆహ్వానం

రాయచోటి టౌన్: ఏపీ మోడల్ స్కూల్‌లో ఆరో తరగతిలో చేరేందుకు అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు రాయచోటి ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ రేఖా ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రేఖా మాట్లాడుతూ ఏపీ మోడల్ స్కూల్‌లో చేరేందుకు మార్చి 31వ తేదీ వరకు ఆన్‌లైన్ ద్వారా రుసుము చెల్లించవచ్చున్నారు. ఏప్రిల్ 20వ తేదీన తమ పాఠశాలలో పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ఓసీ/ బీసీలయితే రూ.150, ఎస్సీ, ఎస్టీలయితే రూ.5 ప్రకారం దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ఆటో కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటుచేయాలి

మదనపల్లి: గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణ ప్రాంతాలకు ప్రయాణికులను గమ్య స్థలానికి చేరవేస్తూ, ప్రభుత్వానికి కోట్ల రూపాయలు పన్నులు చెల్లిస్తున్న ఆటో డ్రైవర్లకు పీఎఫ్, ఈఎస్ఐ పెన్షన్ తో కూడిన సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం ఏఐటీయూసీ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ ఆటో డ్రైవర్స్ వర్కర్స్ ఫెడరేషన్ అన్నమయ్య జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం రెడ్డప్ప అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సాంబశివ మాట్లాడుతూ ఆటో డ్రైవర్లకు భారీగా చలానాలు పెంచుతూ ప్రభుత్వం విడుదల చేసిన జీవో నెంబర్ 21, 31 రద్దు చేయాలని డిమాండ్ చేశారు. డీజిల్, పెట్రోల్ ధరలతో పాటు థర్డ్‌పార్టీ ఇన్సూరెన్స్ 30 శాతానికి తగ్గించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఆటోల మీద ఉన్న పోలీస్ ఈ– చలానులు రద్దు చేయాలని కోరారు. గ్రామీణ,పట్టణ ప్రాంతాల్లో ఆటో స్టాండ్లు, పార్కింగ్ స్థలాలు కేటాయించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన 894 గెజిట్ నోటిఫికేషన్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ఉప ప్రధాన కార్యదర్శి సలీం భాషా, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సురేష్ కుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు వేణు గోపాల్ రెడ్డి ఏఐటీయూసీ మదనపల్లి నియోజకవర్గ కార్యదర్శి ముబారక్, అధ్యక్షుడు రెడ్డప్ప, మదనపల్లి పట్టణ కార్యదర్శి తిరుమల ఆటో డ్రైవర్స్ వర్కర్స్ ఫెడరేషన్ నాయకులు నాగేశ్వరరావు, వెంకటేష్,రమణ, మస్తాన్,శివ శంకర పాల్గొన్నారు.

కబడ్డీ పోటీల్లో విద్యార్థిని ప్రతిభ

వీరబల్లి: మండలంలోని ఉప్పరపల్లి జెడ్పీ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న క్రీడాకారిణి రెడ్డి కావ్య మధ్యప్రదేశ్‌లో జరిగిన జాతీయస్థాయి కబడ్డీ పోటీల్లో రాణించి భళా అనిపించారు. ఈమె ప్రతిభను గుర్తించిన అన్నమయ్య జిల్లా విద్యాశాఖ అధికారి సుబ్రహ్మణ్యం గురువారం కావ్యకు సర్టిఫికెట్ అందించి అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్, పీడీ నల్లమల శేఖర్, రెడ్డప్పరెడ్డి పాల్గొన్నారు.


రెడ్డి కావ్యను అభినందిస్తున్న డీఈఓ

ఆలయ హుండీ సొమ్ము లెక్కింపు

కడప కల్చరల్ : కడప నగరం మున్సిపల్ మైదానంలోగల శ్రీ రాజరాజేశ్వరీదేవి ఆలయ హుండీ ఆదాయాన్ని గురువారం లెక్కించారు. దేవాదాయశాఖ నుంచి కార్యక్రమాన్ని పర్యవేక్షించేందుకు ఇన్‌స్పెక్టర్ జి.రమణమ్మ హాజరయ్యారు. ఆలయ ఈఓ ఎ.శ్రీధర్ ఆధ్వర్యంలో హుండీల సొమ్మును ఆలయ ప్రాంగణంలో లెక్కించారు. గత సెప్టెంబరు 11 నుంచి ఇప్పటి వరకు హుండీల ద్వారా ఆరు నెలలపాటు రూ. 1,43,678 సొమ్ము లభించినట్లు ఈఓ తెలిపారు. సొమ్ము లెక్కింపులో అర్చకులు, సిబ్బంది, భక్తులు, మాజీ చైర్మన్ కె.ఉమేష్, మాజీ ధర్మకర్త అబ్బిశెట్టి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సర్వీసు ఉన్న ఉపాధ్యాయులను నియమించాలి

కడప ఎడ్యుకేషన్: పదవ తరగతి పరీక్షల విధులకు సంబంధించి నియమించే డిపార్టుమెంట్, చీఫ్ సూపరింటెండెంట్లను కనీసం 6 సంవత్సరాలు సర్వీసు పూర్తి చేసుకున్న వారిని నియమించాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మేకల శివార్జున డిమాండ్ చేశారు. ఈ విషయమై గురువారం డీఈఓ షేక్ షంషుద్దీన్‌ను కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదవ తరగతి పరీక్షల విధులకు సంబంధించిన చీఫ్‌లు, డిపార్టుమెంట్ ఆఫీసర్లకు అతి తక్కువ సర్వీస్ ఉన్న పాఠశాల సహాయకులను నియమిస్తున్నారన్నారు. ఈ విషయంలో కనీసం 6 సంవత్సరాల సర్వీసు పూర్తి చేసిన వారిని నియమించాలన్నారు. ప్రస్తుతం పాఠశాల సహాయకులను పదవ తరగతి ఇన్విజిలేటర్లుగా నియమించాలని ప్రభుత్వం భావిస్తోందన్నారు. ఇది సరైనది కాదన్నారు. ఈ విషయంలో ప్రభుత్వం, అధికారులు ఆలోచించాలన్నారు. అదే విధంగా సీనియారిటి జాబితాలోని అభ్యంతరాలను స్వీకరించే గడువు తేదీనీ పొడిగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సుదర్శన్‌బాబు, గంగరాజు, ఉపాధ్యాయులు, ఎస్టీయూ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

అక్రమాలకు పాల్పడితే చర్యలు

– పీడీ వెంకటరత్నం


పనులను పరిశీలిస్తున్న పీడీ వెంకటరత్నం

గాలివీడు: ఉపాధి పనుల్లో అక్రమాలకు పాల్పడితే సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని ఉపాధి హామీ పథకం పీడీ వెంకటరత్నం హెచ్చరించారు. మండలంలోని గాలివీడు, గోరాన్‌చెరువు, నూలివీడు గ్రామాల్లో ఉపాధి పనులను ఆయన పరిశీలించారు. నూలివీడులో జరిగే పనుల కొలతలు, పనుల పారదర్శకతపై అసంతృప్తి వ్యక్తం చేశారు. తీరు మారకుంటే విధుల నుంచి తొలగించాల్సి వస్తుందని టీఏ శివశంకర్‌ను ఆయన హెచ్చరించారు. మండలంలో రైతులకు ఉపయోగపడే పనులు చేయాలని, పని ప్రదేశాల్లో కూలీలకు అన్ని సౌకర్యాలు కల్పించాలని ఏర్పాటు చెయ్యాలని సూచించారు. ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

నేర నియంత్రణపై అవగాహన


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

ఒంటిమిట్ట: సమాజ భద్రతలో పోలీసుల పాత్ర, నేర నియంత్రణ విధానాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నట్లు కల్పించేందుకు ఒంటిమిట్ట ఒంటిమిట్ట ఏఎస్ఐ ఆనంద రావు తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో గురువారం ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. శ్రీసాయి భారతి హైస్కూల్ విద్యార్థులకు స్టేషన్‌లో కేసుల నమోదు, దర్యాప్తు విధానం, నేర పరిశోధనలో ఫోరెన్సిక్ సాంకేతికత వాడుక, కమాండ్ కంట్రోల్ వ్యవస్థ గురించి విద్యార్థులకు సిబ్బంది వివరించారు. ఏఎస్ఐ మాట్లాడుతూ క్రమశిక్షణ, చట్టపాలన, భద్రతపై అవగాహన కల్పించేందుకు ఈ తరహా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసులు, ప్రధానోపాధ్యాయుడు సుబ్బరాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యంతో చదవాలి


ఓపెన్ హౌస్‌లో ఎస్ఐ రామకృష్ణ, విద్యార్థులు

గాలివీడు: విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని కష్టపడి చదివి అత్యున్నత స్థాయికి ఎదగాలని ఎస్ఐ రామకృష్ణ పిలుపునిచ్చారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో గురువారం ఓపెన్ హౌస్ నిర్వహించారు. పోలీసులు వాడే గన్స్, దుస్తులు ఇతరత్రా వాటిపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ విద్యార్థులు తల్లిదండ్రుల కలలను సాకారాం చేయాలన్నారు. పోలీసులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రమశిక్షణ.. విలువలతో కూడిన విద్య అవసరం


పది విద్యార్థులతో ఉపాధ్యాయులు

చిన్నమండెం: క్రమశిక్షణతోనే విద్యార్థులకు విలువలతో కూడిన విద్య అందుతుందని ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ రమేష్, మల్లూరు జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు బి.రెడ్డన్న పేర్కొన్నారు. మల్లూరు జడ్పీ హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థులకు గురువారం వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న మధ్యాహ్న భోజనం, ఉచిత పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలు, ట్యాబ్‌లు ఉపయోగించుకొని బంగారు భవిష్యత్తు సొంతం చేసుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పరీక్షలు ప్రశాంతం


పరీక్షలకు హాజరైన విద్యార్థులు

సంబేపల్లి: మండలంలోని యర్రగుంట్ల గురుకుల కళాశాలలో గురువారం ఇంటర్ ప్రథమ సంవత్సర పరీక్ష ప్రశాంతంగా జరిగింది. 342 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా ముగ్గురు రాలేదని చీఫ్ విజయ్ కుమార్ తెలిపారు.పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

ట్రాఫిక్ సమస్య పరిష్కరించాలి

రైల్వేకోడూరు అర్బన్: రైల్వేకోడూరు పట్టణంలో ట్రాఫిక్ సమస్య పరిష్కరించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు పండుగోలమణి, కార్యదర్శి ఎం.విజయ్ అన్నారు. స్థానిక కార్యాలయంలో వారు మాట్లాడుతూ రైల్వేకోడూరులో ట్రాఫిక్ సమస్య విపరీతంగా ఉందన్నారు. ఇటీవల బొగ్గు లారీ రోడ్డుపై బోల్తా పడి రోజంతా ప్రజలు ఇబ్బందులకు గురయ్యారన్నారు. అధికారులు సమస్య పరిష్కరించాలని కోరారు.